సాక్షి వరంగల్
సోమవారం । 6 । అక్టోబర్ । 2025



సమస్య పరిష్కారానికి అన్వేషణ

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు సమస్యల పరిష్కారాన్ని అన్వేషించేందుకు కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ బిల్డథాన్‌ను ప్రారంభించింది. - 8లో▸



పెండింగ్ బకాయిలు చెల్లించాలి

రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ బకాయిల సాధన సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$32^0 / 23^0$

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు

న్యూశాయంపేట: ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సత్యశారద ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా గ్రీవెన్స్ రద్దు చేశామన్నారు. ఎన్నికలు పూర్తి అయ్యే వరకు ప్రజావాణి కార్యక్రమం జరగదన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

నేడు గ్రేటర్ గ్రీవెన్స్ సెల్

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలపై ప్రజలు రాత పూర్వకంగా ఫిర్యాదులు అందజేయాలని ఆమె కోరారు.

7న రాష్ట్ర పురావస్తుశాఖ డైరెక్టర్ రాక

ఖిలా వరంగల్: చారిత్రక ప్రసిద్ధి చెందిన కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్ మధ్యకోటకు ఈనెల 7న రాష్ట్ర పురావస్తుశాఖ డైరెక్టర్ కూతాడి అర్జున్‌రావు రానున్నారు. ఈసందర్భంగా శంభునిగుడి, మ్యూజియ భవనం నిర్మాణాన్ని పరిశీలించనున్నారు.

9 నుంచి లా సప్లిమెంటరీ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఐదేళ్ల లాకోర్సు ఏడో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 9నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆసిం ఇక్బాల్ తెలిపారు. ఈనెల 9న మొదటి పేపర్, 13న రెండో పేపర్, 15న మూడో పేపర్, 17న నాలుగో పేపర్, 22న ఐదో పేపర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వారు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 6న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కొత్తూరు, హనుమాన్‌నగర్ డబ్బాలు, కేయూ సెకండ్ గేట్, రెడ్డి కాలనీ, పాలజెండా, యాదవనగర్, ఏకశిల కాలేజీ, గోపాల్‌రావు బిల్డింగ్, కొత్తూరు మార్కెట్ ప్రాంతంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. జవహర్‌కాలనీ, కొండా మురళి గెస్ట్‌హౌస్ రోడ్డు, ఎస్‌వీఎస్ హోమ్స్, విష్ణుపురి కాలనీ, నవయుగ కాలనీ, ద్వారకాసాయి కాలనీ ప్రాంతంలో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు, నయింనగర్, లష్కర్‌సింగారం, రాజాజీనగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్‌జీఎఫ్ అండర్-19 ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా శ్రీధర్



వరంగల్ స్పోర్ట్స్: పాఠశాల క్రీడల సమాఖ్య (ఎస్‌జీఎఫ్) అండర్-19 ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా హసన్‌పర్తి మండలంలోని భీమారం జెడ్పీహెచ్‌ఎస్ ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నరెడ్ల శ్రీధర్ నియమితులయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ వాసంతి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. సెక్రటరీగా శ్రీధర్ రెండేళ్ల పాటు కొనసాగుతారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



పర్వతగిరి: తాళం వేసి ఉన్న చోరీ జరిగిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మార్కెట్ యార్డు సమీపంలోని చనమల్ల నర్సయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి నాలుగు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చి చూసే సరికి గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లో తన కూతురు కాలేజీ ఫీజు కోసం దాచిన రూ.50వేల నగదు, బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

దూది రైతుల దుఃఖం

అకాల వర్షాలతో దెబ్బతిన్న పత్తిపంట

పత్తి పంటలో దిగాలుగా ఉన్న రైతు నెక్కొండ మండలం గుండ్రపల్లికి చెందిన మనుబోతు రమణారెడ్డి. తనకున్న నాలుగు ఎకరాల్లో రూ.1.60 లక్షల పెట్టుబడి పెట్టి పత్తి సాగు చేశాడు. తొలకరి వర్షానికి పత్తి విత్తనాలు విత్తాడు. తొలుత వరుణుడు ముఖం చాటేయడంతో సాగునీరుకు ఇబ్బంది పడినా.. ఆ తర్వాత వర్షాలకు పంట ఏపుగా పెరిగింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పత్తిచేనులో నీరు నిలిచి పంట అంతా ఎర్ర బడింది. దీంతో తెగుళ్ల బెడద కారణంగా ఎదుగుదల నిలిచి చెట్టుకు రెండు నుంచి మూడు కాయలు మాత్రమే పడ్డాయి. అవి కూడా మురిగిపోయాయి. చేసిన కష్టం వృథా అయింది. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



- మురిగిపోతున్న పత్తి కాయలు
- సీసీఐ కొనుగోళ్లపై అనుమానాలు
- కొత్త నిబంధనలతో టెండర్లకు దూరంగా జిన్నింగ్ మిల్లులు
- దళారులకు వరంగా మారిన కొనుగోళ్లు
- జిల్లాలో 1,26,500 ఎకరాల్లో పత్తి సాగు



ఈ ఫొటోలో పత్తి కాయలు ఒలుస్తోన్న మహిళా రైతు నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన బత్తిని అరుణ. తనకున్న ఎకరం భూమిలో పత్తి పంట సాగు చేసింది. సుమారు రూ.40వేల వరకు పెట్టుబడి పెట్టింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పంట నష్టపోయింది. పత్తి పంటలో వర్షం నీరు నిలవడంతో దిగుబడి తగ్గింది. ఉన్న ఒకటి, రెండు కాయలు తెంపుకొచ్చి ఇంటి దగ్గర ఒలుస్తోంది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇలా జిల్లా వ్యాప్తంగా పత్తి రైతుల పరిస్థితి ఇలానే ఉంది.

నర్సంపేట: పత్తి రైతు ఏటా నష్టపోతూనే ఉన్నాడు. అకాల వర్షాలు, తెగుళ్లు, చీడపీడలతో దిగుబడి రాక, ఉన్న కొద్దిపాటి పత్తిని మద్దతు ధరకు అమ్ముకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో పెట్టిన పెట్టుబడులు పెరిగి, అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.8,110 ధర కూడా పెట్టడం లేదు. కొత్త నిబంధనలతో జిన్నింగ్ మిల్లులు టెండర్లకు ముందుకు రాకపోవడంతో సీసీఐ కొనుగోళ్లపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇదే అదనుగా దళారులు క్వింటాకు రూ.3 వేల నుంచి రూ.7వేల వరకు కొనుగోలు చేస్తూ రైతులను నిండా ముంచుతున్నారు.

అకాల వర్షాలు, తెగుళ్లు, ఎరువుల కొరత

ఈ ఏడాది మే మాసంలో కురిసిన అకాల వర్షాలతో రైతులు రోహిణి కార్తెలో పత్తి విత్తనాలు నాటారు. ఏపుగా పెరిగి కాయ దశలో తెగుళ్లు విజృంభించి పత్తి పంటను నాశనం చేశాయి. ఇదే క్రమంలో యూరియా దొరకకపోవడంతో పత్తి ఎదుగుదలలో లోపం స్పష్టంగా కనిపించింది. దీంతో దిగుబడి గణనీయంగా తగ్గింది. అయితే ఉన్న కాస్త పత్తి ఏరి ఇటీవల అమ్ముకుంటున్న రైతులకు మద్దతు ధర లభించడం లేదు. సీసీఐ కొనుగోలు లేకపోవడంతో దళారులు వారిని నిలువునా ముంచుతున్నారు.

వర్షాలతో పత్తి అమ్మకాలు...

అకాల వర్షాలతో రైతులు పత్తిని ఇంట్లో నిల్వ చేసుకోవడం లేదు. ఏరిన పత్తిని ఏరినట్లు మార్కెట్‌కు తరలించి అమ్ముకుంటున్నారు. ఉన్న కొద్ది పాటి పత్తిని అమ్మితే మద్దతు లభించడం లేదని, కూలీల ఖర్చులు పెరిగాయని, దీంతో పెట్టిన పెట్టుబడులు మీద పడి అప్పుల పాలవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సీసీఐ కొనుగోళ్ల ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

కొత్త నిబంధనలతో...

సీసీఐ కొత్త నిబంధనలు కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. 2022లో క్వింటా పత్తి ధర రూ.14వేలు ఉండగా అంతర్జాతీయ ప్రమాణాలతో పత్తి ధరలు భారీగా పడిపోయాయి. దీంతో రైతులు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సీసీఐ ధరలపై ఆధారపడుతున్నారు. కాగా సీసీఐ ఉమ్మడి వరంగల్ జిల్లాలో 58 జిన్నింగ్ మిల్లుల ద్వారా కొనుగోలు చేస్తుంది. సీసీఐ, జిన్నింగ్ మిల్లుల మధ్య ఏర్పడిన వివాదంతో కొనుగోలు జరగడం లేదు. మార్క్‌ఫెడ్ మినహా ప్రైవేట్ వ్యాపారులు దూరంగా ఉండడంతో సీసీఐ కొనుగోలు ప్రశ్నార్థకంగా మారాయి.



మత్తడి వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

సండే సందడి

పర్యాటక ప్రాంతమైన పాకాలలో ఆదివారం సందడి నెలకొంది. సండే సెలవు రోజు కావడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు భారీగా తరలివచ్చారు. పార్కు, మత్తడి వద్ద, బోటింగ్ పాయింట్ వద్ద ఉత్సాహంగా గడిపారు. పర్యాటకులు భారీగా తరలిరావడంతో కిటకిటలాడింది. - ఖానాపురం



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు నడపలేం..

- ట్రస్మా జిల్లా అధ్యక్షుడు చల్లా నాగార్జున్‌రెడ్డి



నెక్కొండ: ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్' (బీఏఎస్) నిధులు విడుదల కాకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుకారుతోంది. మూడేళ్లుగా బీఏఎస్ నిధులు మంజూరు చేయకపోవడంతో ఆయా స్కూల్స్ యాజమాన్యాలు నేటి (సోమవారం) నుంచి విద్యార్థులకు పాఠశాలల అనుమతి నిరాకరిస్తున్నామని బెస్ట్ అవైలబుల్ స్కూల్ వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రధాన సలహాదారుడు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు చల్లా నాగార్జున్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యాజమాన్యాలు వడ్డీలకు అప్పులు తెచ్చి, నగలు తాకట్టు పెట్టి ఇప్పటి వరకు పాఠశాలలను నడిపించామన్నారు. గత బకాయిలు తీర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించామన్నారు. అయినా ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదని, ఇది ప్రభుత్వ నిర్లక్ష్యమేనని ఆయన స్పష్టం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 32 స్కూళ్లు ఉన్నాయని, ఇందులో 3,500 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుతున్నారన్నారు. గతంలో నిధుల విడుదల కోసం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎస్సీ, ఎస్టీ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌లను కలిసి విన్నవించామన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్, సోషల్ వెల్ఫేర్ కమిషనర్, ఉమ్మడి జిల్లా కలెక్టర్లకు, డీటీడబ్ల్యూ, డీఎస్‌డీఓ అధికారుల దృష్టికి కూడా తీసుకుపోయామన్నారు. ఇకపై స్కూళ్ల నిర్వహణ ఆర్థిక భారాన్ని భరించలేమని, విద్యార్థులకు అనుమతించడం లేదని తల్లిదండ్రులకు వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా సమాచారాన్ని అందించామన్నారు. ప్రభుత్వం స్పందించి బీఏఎస్ బకాయిలు చెల్లించాలని కోరారు.

మక్క రైతులను ముంచుతున్న దళారులు

- ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్



రైతులతో మాట్లాడుతున్న నాయకులు

నర్సంపేట: రైతులు ఆరుగాలం కష్టించి పండించిన మొక్కజొన్నలను దళారులు, వ్యాపారులు మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ దోచుకుంటున్నారని, ప్రభుత్వం తక్షణమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని అఖిల భారత రైతు సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంసీపీఐ(యూ) ఏఐకేఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి మొక్కజొన్నలను అమ్మకానికి తీసుకువచ్చిన రైతుల ఇబ్బందులు, ధరల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెద్దారపు రమేశ్ మాట్లాడుతూ రైతాంగం ఆరుగాలం కష్టించి అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని మొక్కజొన్నలను పండిస్తే ప్రభుత్వాలు సరైన మార్కెట్ సౌకర్యం కల్పించకుండా దళారులకు, వ్యాపారులకు వత్తాసు పలుకుతుందన్నారు. ఈ క్రమంలో కనీస మద్దతు ధర క్వింటా రూ.2,400 అమ్మాల్సిన మొక్కజొన్నలు రూ.1,600 నుంచి రూ.2,100 దాటడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలోనే మొదట దిగుబడి వచ్చే జిల్లాలో ఇంత వరకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. అధిక వర్షాలతో దిగుబడి తగ్గి దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతాంగానికి పండిన మొక్కజొన్నలకైనా కనీస మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. మార్కెట్లో మొక్కజొన్నలు ఆరబోసుకుని వారాలు గడుస్తున్న కుంటి సాకులతో ధర తగ్గించడానికి కొనుగోలు జరగకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా తక్షణమే రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కనీస మద్దతు ధర అమలు అయ్యే విధంగా మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, మద్దతు ధర కంటే తక్కువ కొనుగోలు చేసే వ్యాపారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు కన్నం వెంకన్న, డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజాసాహెబ్, సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, ఏఐకేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కేశెట్టి సదానందం, కలకోట్ల యాదగిరి, రాజేందర్, వీరన్న, సురేష్, రైతులు పాల్గొన్నారు.

10 రోజులు 7 దరఖాస్తులు

వైన్స్ అప్లికేషన్లపై ఆసక్తి కరువు

- 13 రోజుల్లో 5,859 దరఖాస్తుల టార్గెట్ చేరేనా?



దరఖాస్తు స్వీకరిస్తున్న కాజీపేట ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్



కాజీపేట అర్బన్: హనుమకొండ జిల్లాలోని (వరంగల్ అర్బన్) 67 వైన్స్‌లకు దరఖాస్తులు అందజేసేందుకు మద్యం వ్యాపారులు అనాసక్తి చూపుతున్నారు. ఇకపై వైన్స్‌కు పెద్ద ఎత్తున దరఖాస్తులు వస్తాయని ఆబ్కారీ శాఖ ఎదురుచూస్తోంది. 2025-27 రెండేళ్ల కాల పరిమితితో వైన్స్ నిర్వహణకు ప్రభుత్వం సెప్టెంబర్ 25న ప్రకటన విడుదల చేసింది. సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తుల స్వీకరణ, అక్టోబర్ 23న లక్కీ డ్రా ద్వారా వైన్స్ కేటాయింపునకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. కాగా, వైన్స్ టెండర్ల పిలుపు నుంచి 10 రోజుల కావొస్తున్నా.. అరకొరగా కేవలం 7 దరఖాస్తులు మాత్రమే ఎక్సైజ్ శాఖకు అందాయి.

ఎలక్షన్స్‌పై ఫోకస్‌తో..

గతంలో వైన్స్ దరఖాస్తుల ఫీజు రూ.2 లక్షలు ఉండగా.. ఈ సారి 3 లక్షలుగా దరఖాస్తుల ఫీజును ప్రభుత్వం ఖరారు చేయడంతో మద్యం వ్యాపారులు నాన్ రీఫండ్ కదా దరఖాస్తులు వేద్దామా.. లేదా? అనే ఆలోచనలో పడ్డారు. వైన్స్ టెండర్ల తరుణంలోనే స్థానిక ఎన్నికల నిర్వహణ ఉండడంతో ఎలక్షన్స్‌లో తేల్చుకుందాం. వైన్స్ దరఖాస్తులకు ఎందుకు ఖర్చు. వస్తే వైన్‌షాపు. పోతే రూ.3 లక్షలు అంటూ వెనుకంజ వేస్తున్నట్లు 10 రోజుల దరఖాస్తులతోనే తెలిసిపోతోంది.

లక్ష్యం చేరేనా?

హనుమకొండ జిల్లాలోని గతంలోని 65 వైన్స్‌కుగాను 2023-25 రెండేళ్ల కాలపరిమితికి 5,859 దరఖాస్తులు రాగా, ఖజానాకు రూ.117 కోట్ల ఆదాయం వచ్చింది. కాగా 2025-27 వైన్స్ టెండర్లకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల దరఖాస్తు ఫీజు కాగా, ఎప్పటికప్పుడు దరఖాస్తులు డబుల్ అవడంతో పాటు ఆదాయం డబుల్ అవుతుండగా.. 13 రోజుల్లో గత టార్గెట్ రీచ్ అయ్యేనా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

వనదేవతలకు మొక్కులు



సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క- సారలమ్మలను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కల్యాణకట్టలో పుట్టువెంట్రుకలను సమర్పించుకున్నారు. అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, చీరసారె, ఎత్తు బంగారం, కానుకలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెల వద్ద పూజలు చేశారు. మొక్కుల అనంతరం భక్తులు మేడారం పరిసరాల్లోని చెట్ల కింద విడిది చేసి వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనలు చేశారు.

రామప్పలో కోలాహలం



రామప్ప రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న పర్యాటకులు

వెంకటాపురం(ఎం): ప్రపంచప్రఖ్యాతి గాంచిన సుప్రసిద్ధ రామప్ప దేవాలయంలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి రామప్ప రామలింగేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్‌లు భక్తులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఆలయ విశిష్టత గురించి గైడ్‌లు విజయ్‌కుమార్, వెంకటేశ్ వివరించారు.

కంఠమహేశ్వరుడికి జలాభిషేకం



పూజలో పాల్గొన్న గౌడ కులస్తులు



మంగళహారతులతో మహిళలు

నర్సంపేట: పట్టణంలో శ్రీకంఠమహేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం స్వామి వారికి భక్తులు జలాభిషేకం నిర్వహించారు. కౌండిన్యుల గోత్రం కలిగిన ప్రతిఒక్కరూ ఆలయానికి డప్పు చప్పుళ్లతో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలు, పెరుగు, నెయ్యి, పసుపు, కుంకుమ, జలాలతో అభిషేకాలు చేశారు. పట్టణంలోని గౌడ కులస్తుల ఇంటి నుంచి బిందెలతో జలాలను కొత్త వస్త్రాలు ధరించి మంగళహారతులతో తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు కోల వెంకటేశ్వర్లుగౌడ్, ప్రధాన కార్యదర్శి మద్దెల శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు గాదగోని సాంబయ్య, ఆర్థిక కార్యదర్శి నాతి సదానందం, గిరగాని కిరణ్, డైరెక్టర్, తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేటలో..

స్వయం సేవకుల కవాతు

నర్సంపేట/వర్ధన్నపేట: రాష్ట్రీయ స్వయం సేవక్ శతజయంతిని పురస్కరించుకుని జిల్లాలోని నర్సంపేట, నెక్కొండ, వర్ధన్నపేట తదితర మండలాల్లో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకులు పథ సంచలన్ (కవాతు) నిర్వహించారు. వందలాది మంది స్వయం సేవకులు ఒకే యూనిఫాం ధరించి క్రమశిక్షణతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కవాతులో ఆర్‌ఎస్‌ఎస్ బ్యాండ్ బృందం వాయిద్యాలను మోగిస్తుండగా పూలతో అలంకరించిన జీపుపై భారతమాత, డాక్టర్ జీ.గురూజీ చిత్ర పటాలతో పాటు భగవద్వజాన్ని (కాషాయజెండా) ఉంచి స్వయం సేవకులు క్రమ పద్ధతిలో కవాతు చేశారు. దారి పొడవునా మహిళలు భగవాధ్వజంపై పూలు చల్లుతూ మంగళహారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నర్సంపేట సంఘచాలక్ మోతె సమ్మిరెడ్డి, గణవేషధారి స్వయం సేవకులు, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట: పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ సేవకులు

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


నరేశ్(ఫైల్)

వెంకటాపురం(కె): విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని పాత్రాపురంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రానిబోయిన నరేశ్(32) తన ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్ డోర్ తీస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన గ్రామస్తులు 108లో వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించే లోపే మృతి చెందాడు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఇనుప పైపు మీద పడి వ్యక్తి ..


రాజయ్య (ఫైల్)

ములుగు రూరల్: ఇనుప పైపు మోస్తున్న క్రమంలో కాలుజారి కిందపడడంతో పైపు మీద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం ములుగు జిల్లాకేంద్రంలో చోటు చేసుకుంది. తోటి కూలీ మహేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న కలెక్టరేట్ పనుల్లో భాగంగా వెంకటాపూర్(ఎం) గ్రామానికి చెందిన సిరిపెల్లి రాజయ్య(48), గడ్డమీది మహేందర్ కలిసి ఫస్ట్ ఫ్లోర్‌లో ఇనుప పైపు ఎత్తుకుని వెళ్తున్నారు. ఈ క్రమంలో రాజయ్య కాలుజారి కిందపడగా పైపు మీద పడి తీవ్ర గాయమైంది. దీంతో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం వెంటనే ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని గుండెలవిసేలా రోదించారు. మృతుడికి భార్య సుమలత, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఘటనా స్థలిని పోలీసులు పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు.

రేబిస్ లక్షణాలతో బాలుడు..

- వావిలాలలో ఘటన


శ్రీచరణ్(ఫైల్)

పాలకుర్తి టౌన్: రేబిస్ లక్షణాలతో ఓ బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాలలో చోటు చేసుకుంది. మృతుడి తల్లిదండ్రుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మైదం శ్రీనివాస్, శ్యామల దంపతుల రెండో కుమారుడు శ్రీచరణ్(10)ను రెండు నెలల క్రితం యాదాద్రి భువనగిరి జిల్లా మాదాపూర్‌లోని అమ్మమ్మ ఇంటి వద్ద కుక్క కరిచింది. రెండు, మూడు రోజులుగా జ్వరంతోపాటు నీరును చూస్తే భయపడడం, నాలుకను బయటకు తీస్తుండడంతోపాటు నోటి నుంచి నురగ వచ్చింది. దీంతో కుటుంబీకులు ఆందోళన చెంది వెంటనే బాలుడిని హైదరాబాద్ తార్నాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. బాలుడి మృతదేహాన్ని స్వగ్రామం తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ పిల్లలు కుక్కలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏ పిల్లలకు కూడా ఇలాంటి దారుణ పరిస్థితి రావొద్దని బోరున విలపించారు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కోరారు.


మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


సాయిరెడ్డి (ఫైల్)

బచ్చన్నపేట : కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ యువకుడు.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కొన్నె గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఉమ్మెంతల సాయిరెడ్డి (33), నందిని దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల గొడవలు జరగడంతో నందిని కాపురానికి రావడం లేదు. దీనిపై మనస్తాపం చెందిన సాయిరెడ్డి ఆదివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ తెలిపారు.

సమస్య పరిష్కారానికి అన్వేషణ

- ఉద్యమంగా వికసిత్ భారత్ బిల్డథాన్-2025
- ఆరో తేదీవరకు పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి
- 6 నుంచి 12 తరగతుల విద్యార్థులకు అవకాశం



విద్యారణ్యపురి: దేశ వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతోపాటు సమస్యల పరిష్కారాన్ని అన్వేషించేందుకు కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్ వికసిత్ భారత్ బిల్డథాన్-2025ను దేశవ్యాప్తంగా ఉద్యమంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో (ప్రభుత్వ, ప్రైవేట్) 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న (మూడు నుంచి ఏడుగురు విద్యార్థుల సమూహాలు) విద్యార్థులు ఈనెల 6వ తేదీలోగా వికసిత్ భారత్ బిల్డథాన్ పోర్టల్ హెచ్‌టీటీపీఎస్//బీబీబీ.జీఓవీ.ఇన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 6న ప్రత్యక్ష సమకాలీన ఆవిష్కరణ కార్యక్రమం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఈ థీమ్స్‌పై వివరణ, చేసే పద్ధతిపై లైవ్ ఇంటరాక్షన్ ప్రోగ్రాం ఉంటుంది.

వికసిత్ భారత్ బిల్డథాన్ ఇతివృత్తాలు..

ఆత్మనిర్భర్ భారత్: స్వావలంబన వ్యవస్థలు, సాధనాలు, పరిష్కారాలను నిర్మించడం. స్వదేశీ ఆలోచనలు, జ్ఞానవ్యవస్థలు అలాగే ఆవిష్కరణలను పెంపొందించడం

స్థానికులకు స్వరం: స్థానిక ఉత్పత్తులు, వనరులను ప్రోత్సహించడం.

సమృద్ధ భారత్: సమృద్ధ భారత్ కోసం శ్రేయస్సు, స్థిరమైన అభివృద్ధికి మార్గాలను సృష్టించడం.

ఉపాధ్యాయుల పాత్ర: విద్యార్థి బృందాలకు మార్గదర్శకత్వం వహించేలా ఉపాధ్యాయుల పాత్ర కీలంగా ఉంటుంది.

- ఆలోచన, సమస్య పరిష్కారం, నమూనా అభివద్ధిపై మార్గదర్శకత్వం అందించేలా ఉపాధ్యాయులు కృషిచేయాల్సి ఉంటుంది.
- పోర్టల్ రిజిస్ట్రేషన్ సమర్పణ (ఆలోచన/నమూనా) ప్రక్రియలో విద్యార్థులకు సాయం చేయడం.

థీంలను వివరించడం: విద్యార్థులు తమ ప్రాజెక్టులను నాలుగు ప్రధాన థీంలతో అర్థం చేసుకున్నారని, సమలేఖనం చేసుకున్నారని ఉపాధ్యాయులు నిర్ధారించుకోవడం.

- స్థానిక సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వడం.
- ఆత్మనిర్భర్ భారత్, స్వదేశీ, సమృద్ధి భారత్‌పై అవగాహన కల్పించాల్సి ఉంటుంది.

జట్టు కృషిని ప్రోత్సహించాలి: టీచర్లు ప్రభావవంతమైన జట్టు డైనమిక్స్ కోసం సహకార వాతావరణాన్ని పెంపొందించుకోవాలి.

విద్యార్థుల పాత్ర: టీంలుగా 6-12 తరగతుల నుంచి 3-7 మంది విద్యార్థుల సభ్యుల బృందంలో చేరాల్సి ఉంటుంది.

ఆవిష్కరణ: సృజనాత్మక ఆలోచనలకు వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలను అభివృద్ధి చేయాల్సి ఉంటుంది.

నమూనాలను రూపొందించుకోవాలి: విద్యార్థులు వారి ఆలోచన భౌతిక లేదా డిజిటల్ నమూనాను రూపొందించడానికి కలిసి పనిచేయాలి.

వీడియోను సృష్టించండి, సమర్పించండి: విద్యార్థుల ప్రాజెక్టు (ఆలోచన లేదా నమూనా) ప్రదర్శించే ఒక చిన్న వీడియోను (2 నిమిషాల కంటే తక్కువ) తయారు చేసి పోర్టల్‌లో సమర్పించాల్సి ఉంటుంది.

- విద్యార్థులు వికసిత్ భారత్ బిల్డథాన్ లో పాల్గొనేలా ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలి.
- 6-12 తరగతుల విద్యార్థుల్లో బిల్డథాన్‌ను చురుకుగా ప్రచారం చేయాల్సి ఉంటుంది.

రిజిస్ట్రేషన్‌ను సులభతరం చేయాలి..

- గడువులోగా అన్ని జట్లు అధికారిక పోర్టల్‌లో నమోదు చేసుకున్నాయని నిర్ధారించుకోవాలి.
- మౌలిక సదుపాయాలను అందించడం: జట్లు ప్రాజెక్టులను సిద్ధం చేసుకునేందుకు, నిర్మించడానికి అనుకూలమైన వాతావరణాన్ని (ప్రయోగశాల, తరగతి గది) అందించాలి.
- విద్యార్థులు తమ తుది ఎంట్రీలను (ఆలోచనలు/నమూనాలు) అప్‌లోడ్ చేయడంలో మార్గనిర్దేశం హెచ్‌ఎంలు, టీచర్లు చేయాల్సి ఉంటుంది.

విద్యార్థులకు ఉత్సాహం కల్పించాలి..

విద్యార్థుల ఉత్సాహాన్ని నిర్ధారించడానికి కార్యకలాపాల శ్రేణిని నిర్వహించాలి. బిల్డథాన్ థీమ్ (ఆత్మనిర్భర్ భారత్, స్వదేశీ, వోకల్ ఫర్ లోకల్ సమృద్ధి) ప్రకారం పాఠశాలలో 4 క్లబ్‌లను ప్రవేశపెట్టడం, పోటీలను నిర్వహించడం (జింగిల్స్, క్విజ్), బిల్డథాన్ పోస్టర్లను ప్రదర్శించడం, ప్రింటెడ్ టీ-షర్టుల వంటి ఈవెంట్ బ్రాండెడ్ మర్చండైజ్‌ను ఉపయోగించాలి. విద్యార్థుల కోసం వర్క్‌షాప్ నిర్వహించడానికి పరిశ్రమ నిపుణులను ఆహ్వానించడం ద్వారా ఇది చేయొచ్చు. పాఠశాలలు, ప్రముఖ ప్రదేశాలల్లో క్యూఆర్ కోడ్‌తో కూడిన పోస్టర్‌ను ప్రదర్శించండి.

జింగిల్ లోగోను వ్యాప్తి చేయాలి



విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు జింగిల్ లోగోను పాఠశాలల్లో విస్తృతంగా వ్యాప్తి చేయాలి. పాఠశాలలో జింగిల్ ప్లే చేయాలి. కేంద్రంలోని మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ అటల్ ఇన్నోవేషన్ మిషన్, నీతి ఆయోగ్, అఖిలభారత సాంకేతిక విద్య (ఏఐసీటీఈ) సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దేశంలోని జిల్లాస్థాయిలో వెయ్యి మందికి బహుమతులు, రాష్ట్రస్థాయిలో వంద మంది, జాతీయస్థాయిలో 10 మంది విజేతలకు మొత్తం రూ.కోటి విలువైన బహుమతులు అందించనున్నారు.

– ఎస్.శ్రీనివాసస్వామి, జిల్లా సైన్స్ అధికారి, హనుమకొండ

పేదల మనిషి గడ్డం వెంకటస్వామి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హన్మకొండ: గూడు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించి, ఇళ్లు కట్టించిన పేదల మనిషి గడ్డం వెంకటస్వామి అని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి జయంతి నిర్వహించారు. ముందుగా వెంకటస్వామి చిత్రపటానికి సీఎండీ వరుణ్‌రెడ్డి, డైరెక్టర్లు, అధికారులు, ఉద్యోగులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఉద్యమకారుడిగా, ప్రజాసేవకుడిగా, రాజకీయ నాయకుడిగా వెంకటస్వామి విశిష్ట సేవలందించారని కొనియాడారు. వెంకటస్వామి 'కాకా'గా అందరికీ సుపరిచితులు అని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వి.తిరుపతిరెడ్డి, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, చీఫ్ ఇంజనీర్లు టి.సదర్‌లాల్, వెంకటరమణ, సీజీఎం రవీంద్రనాథ్, జీఎం వెంకటకృష్ణ, డీఈ (టెక్నికల్) సంపత్‌రెడ్డి, ఏఎస్ రమణారెడ్డి, ఏఓ నీలారపు రాజేందర్, దేవేందర్, సుదర్శన్‌రావు, రమేశ్, రవిచంద్ర, గోవర్ధన్, హేమచందర్ పాల్గొన్నారు.

బైక్‌పై లిఫ్ట్ ఇచ్చి.. ఆపై చైన్‌స్నాచింగ్

- వృద్ధురాలి మెడ నుంచి పుస్తెల తాడు లాక్కెళ్లిన దుండగుడు
- కొండపర్తిలో ఘటన


వివరాలు సేకరిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్

ఐనవోలు: కొండపర్తిలో చైన్‌స్నాచింగ్ జరిగింది. నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధురాలికి బైక్‌పై లిఫ్ట్ ఇచ్చిన దుండగుడు.. మార్గమధ్యలో ఆమె మెడ నుంచి బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లాడు. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన వృద్ధురాలు వరంగంటి వనమ్మ ఆదివారం గ్రామ శివారులోని తన వ్యవసాయ క్షేత్రానికి నడుచుకుంటూ వెళ్తోంది. ఈ సమయంలో అటు వైపుగా బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి ఆమెకు లిఫ్ట్ ఇచ్చాడు. మార్గమధ్యలో బైక్ ఆపి వృద్ధురాలి మెడ నుంచి రెండు తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, పర్వతగిరి ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్, ఐనవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్ ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు.

అలుగు పొలుసులు తరలిస్తున్న ముఠా అరెస్ట్


అధికారులు స్వాధీనం చేసుకున్న అలుగు పొలుసులు

న్యూశాయంపేట: ములుగు జిల్లా ఏటూరునాగారం అటవీ ప్రాంతం నుంచి అలుగు పొలుసులు (పాంగోలిన్ స్కేల్స్) అక్రమంగా తరలించి ఆగ్నేసియా దేశాలకు ఎగుమతి చేస్తున్న నలుగురు సభ్యులు గల ముఠాను హైదరాబాద్ యూనిట్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు ఆదివారం హనుమకొండ ఉనికిచర్ల బైపాస్ వద్ద అరెస్ట్ చేశారు. వారి నుంచి 6.53 కిలోల అలుగు పొలుసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఔషధ తయారీలో అలుగు పొలుసులను వినియోగిస్తారన్నారు. వైల్డ్ లైఫ్ చట్టం ప్రకారం అలుగులను వేటాడడం నేరమన్నారు. కాగా, నిందితులు తిమ్మంపేటకు చెందిన సునీల్, మల్లక్‌పల్లికి చెందిన యోహాన్, వాజేడు మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన ఎం.సందీప్, కోమటిపల్లికి చెందిన మనోజ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో హనుమకొండ డీఎఫ్ఓ లావణ్య, ఎఫ్ఆర్ఓ శిరీష, డీఆర్ఓ మోహన్, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వలకు చిక్కిన వింత చేప



వాజేడు: ములుగు జిల్లా వాజేడులోని గోదావరిలో వింత చేప చిక్కింది. వాజేడుకు చెందిన కొప్పనాతి వెంకటేశ్వర్లు ఆదివారం గోదావరికి చేపల వేటకు వెళ్లగా వలలో వింత చేప పడింది. అది ఏ రకం చేపనో, దాని పేరు ఏమిటో తనకు తెలియదని చెప్పాడు. 58 ఏళ్లుగా చేపలు పడుతున్నానని, ఇంత వరకు ఈ రకం చేపను చూడలేదని తెలిపాడు. చేపపైన జిగ్‌జాగ్‌గా నల్ల మచ్చలు గరుకుదనంతో ఉన్నాయని చెప్పాడు. అన్ని చేపలకు ఉన్నట్లు చేప పైన ఎలాంటి పొలుసులు లేవు. ఈ చేపను తింటే ఏమైనా అవుతుందేమోనని భావించి దానిని తిరిగి గోదావరిలో వదిలేశానని వెంకటేశ్వర్లు వివరించాడు.

పిడుగుపాటుతో పగిలిన ట్రాన్స్‌ఫార్మర్


పిడుగుతో ట్రాన్స్‌ఫార్మర్ పగిలి కారుతున్న ఆయిల్

శాయంపేట: పిడుగుపాటుతో ట్రాన్స్‌ఫార్మర్ పగిలిన ఘటన మండలంలోని గంగిరేణిగూడెం గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగిరేణిగూడెం గ్రామంలోని పోచమ్మ గుడి దగ్గర సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. మధ్యాహ్నం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో పిడుగు పడింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ పగిలి ఆయిల్ కారుతోంది. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

'భీమునిపాదం'లో పర్యాటకుల సందడి..

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీపంలోని భీమునిపాద జలపాతంలో పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం సెలవుదినం కావడంతో పర్యాటకులు జలపాతాన్ని వీక్షించడానికి కారు, ఆటో, ద్విచక్రవాహనాలపై భీమునిపాదం చేరుకున్నారు. ఈ సందర్భంగా జలపాతం నుంచి జాలువారుతున్న నీటి కింద స్నానం చేస్తూ సందడి చేశారు. సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ ఎంజాయ్ చేశారు.


జలపాతం వద్ద పర్యాటకులు ..

ఇసుక లారీలతో ట్రాఫిక్ జామ్


మల్లూరు వద్ద ప్రధాన రహదారిపై నిలిచిన వాహనాలు

- మల్లూరులో రెండు గంటలపాటు నిలిచిన రాకపోకలు
- ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రయాణికులు


బస్సు దిగి చెట్ల కిందకు వెళ్తున్న ప్రయాణికులు


ట్రాఫిక్ క్లియర్ చేయిస్తున్న ఎస్సై సూరి

మంగపేట: ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు వద్ద ఏటూరునాగారం-బూర్గంపాడు ప్రధాన రహదారిపై ఇసుక లారీలను నిలిపి వేయడంతో ఆదివారం ట్రాఫిక్ జామ్ అయింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నాలుగు కిలోమీటర్ల మేర ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. ఫలితంగా ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, కార్లు, ఆటోల్లోని ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఉక్కపోత భరించలేక వాహనాలు దిగి రోడ్డు వెంట చెట్లకింద నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్సై టీవీఆర్ సూరి సిబ్బందితో హుటాహుటిన చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేయించారు. ఇసుక లోడింగ్ కోసం వచ్చే లారీలను పార్కింగ్ చేసేందుకు ప్రత్యేక స్థలాన్ని చూసుకోవాలని హెచ్చరించారు.

పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

- రిటైర్డ్ ఎంప్లాయీస్ బకాయిల సాధన సమితి డిమాండ్


మాట్లాడుతున్న ధర్మేంద్ర

కాశీబుగ్గ / కాజీపేట సెంటర్: రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ బకాయిల సాధన సమితి తెలంగాణ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అడ్‌హక్ కమిటీ సర్వసభ్య సమావేశం కన్వీనర్ శ్రీధర్ల ధర్మేంద్ర అధ్యక్షతన హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024 , మార్చి నుంచి 2025, సెప్టెంబర్ వరకు రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయి డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎం.చంద్రమౌళి, అధ్యక్షుడిగా శ్రీధర్ల ధర్మేంద్ర, అసోసియేట్ అధ్యక్షులుగా కందుకూరి దేవదాస్, ఎండి.మహబూబ్ అలీ, ప్రధాన కార్యదర్శిగా కడారి భోగేశ్వర్, జాయింట్ సెక్రెటరీలుగా ఎండి.అబ్దుల్ గఫార్, ఎం. దామోదర్, ఉపాధ్యక్షులుగా సంకాబంద్రి నారాయణ, ఎస్.గోవర్ధన్, పి.సంజీవ రెడ్డి, లక్ష్మయ్య, కార్యదర్శులుగా ఎస్.విష్ణువర్ధన్, పి.సోమయ్య.పి.రమణారెడ్డి, బి.అశోకుమార్, కోశాధికారిగా సూరం కుమారస్వామి, టి.రఘువీర్ ఎన్నికయ్యారు.

పార్కిన్‌సన్‌కు అత్యుత్తమ చికిత్స

- యశోద హాస్పిటల్ న్యూరాలజిస్టు డాక్టర్ రూపం బోర్గాని


మాట్లాడుతున్న డాక్టర్ రూపం బోర్గాని

హన్మకొండ: పార్కిన్‌సన్ (వణుకుడు) వ్యాధికి హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రిలో అత్యుత్తమ చికిత్స అందిస్తున్నట్లు ఆస్పత్రి పార్కిన్‌సన్ వ్యాధి, చలనరుగ్మతల డైరెక్టర్, ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ రూపం బోర్గాని తెలిపారు. హనుమకొండ నక్కలగుట్టలోని యశోద క్లినిక్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చికిత్స పొంది కోలుకున్న హుజూరాబాద్‌కు చెందిన ఉపాధ్యాయుడు అశోక్‌రెడ్డి, కాజీపేట ఫాతిమానగర్‌కు చెందిన సంగీతతో కలిసి ఆయన మాట్లాడారు. పార్కిన్‌సన్ ప్రపంచంలో అత్యంత సాధారణ న్యూరో జనరేటివ్ వ్యాధి అని, మన దేశంలో ప్రతి లక్ష జనాభాలో 42 నుంచి 60 శాతం ప్రజలు ఈ వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. ఈ వ్యాధి లక్షణాలు బీపీ, షుగర్‌లా జీవితాంతం ఉంటాయని వివరించారు. డీ బ్రెయిన్‌స్టిములేషన్(డీబీఎస్) చికిత్స ద్వారా వ్యాధి నయం చేయవచ్చని తెలిపారు. మందులు వాడినా ప్రతి సంవత్సరం పెరుగుతుందని, మొదటి మూడు, నాలుగు సంవత్సరాలు మందులు ఇవ్వనున్నట్లు వివరించారు. అయితే ఈ మందుల ప్రభావం రానురాను అంతగా కనిపించదని, ఈ సమయంలో డీబీఎస్ (డీ బ్రెయిన్‌స్టిములేషన్) ద్వారా వ్యాధి లక్షణాలను తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రిలో పార్కిన్‌సన్ వ్యాధిగ్రస్తులకు డీబీఎస్ చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఈ విధానం జీవన పరిణామాలు మెరుగుపరుచడంలో అద్భుత ఫలితాలు ఇస్తుందన్నారు. మెదడులోని నిర్దిష్ట భాగంలో ఎలక్ట్రొడ్‌ అమర్చి ఛాతిలోని చిన్న పరికరానికి కనెక్ట్ చేయడం ద్వారా చేసే ప్రక్రియ అన్నారు. హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్‌లో డాక్టర్ రూపం బోర్గాని ఆధ్వర్యంలోని సీనియర్ క్లినికల్ డైరెక్టర్ న్యూరాలజిస్ట్ రాజేశ్ అలుగోలు, వీబీఎస్ ఆర్‌కే ప్రసాద్ టీం సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు. ఈ వ్యాధికి సుమారు రూ.13 నుంచి రూ.14 లక్షల వరకు ఖర్చు అవుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకంలో ఈ వ్యాధిని చేర్చినట్లు చెప్పారు. సమావేశంలో సాయి, వెంకట్, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


కనకం రాజు

మడికొండ: భార్యతో గొడవపడి యువకుడు అదృశ్యమయ్యాడు. సీఐ కిషన్ కథనం ప్రకారం.. మడికొండ గ్రామానికి చెందిన కనకం రాజు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువుల ఇళ్లలో కుటుంబ సభ్యులు వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు. రాజు తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ వివరించారు.